# బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలి

- సంక్షేమ పథకాలను గడప గడపకూ వివరించాలి
- మంథని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్



మంథని : బీఆర్ఎస్‌లో చేరుతున్న సీతంపేట కాంగ్రెస్ నాయకులు రాజ్‌కుమార్,లింగం శ్రీనివాస్

మంథని, నవంబర్19: అసెంబ్లీ ఎన్నికల్లో మంథని గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడప గడపకూ వివరిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. ముత్తారం మండలం సీతంపేట గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు రావుల రాజ్‌కుమార్, లింగం శ్రీనివాస్ ఆదివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి పుట్ట మధూకర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పుట్ట మధూకర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాలన్నీ అభివృద్ధి పథంలో ముందుకు సాగాయన్నారు. గ్రామాల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు.యువత సోషల్ మీడియాను వేదికగా చేసుకొని బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. తాను చేసిన అభివృద్ధి, చేసని సేవా కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలన్నారు. ప్రతి ఒక్కరూ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తూ ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. కొత్త, పాత అనే తేడా లేకుండా బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు.

**నాయకుడిగా కాదు.. సేవకుడిగా పని చేసే వ్యక్తి**

నాయకుడిగా కాదు.. సేవకుడిగా పని చేసే వ్యక్తి పుట్ట మధూకర్ అని మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ అన్నారు. మంథని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్‌కు మద్ధతుగా పట్టణంలోని ఆరో వార్డులో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గడప గడప వెళ్తూ బీఆర్ఎస్ సర్కారు చేపట్టి అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ పుట్ట మధూకర్‌కు ఓటు వేసి గెలిపించాలని ఓట్లను అభ్యర్థించారు. చేపట్టిన అభివృద్ధి పనులపై తయారు చేసిన పుస్తకంతో పాటు బీఆర్ఎస్ మ్యానిఫెస్టో కరపత్రాలను అందజేశారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఓడిపోయిన పుట్ట మధూకర్ ఇక్కడే ఉండి ప్రజలకు సేవలు అందించారనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. 2018 ఎన్నికల సమయంలో అబద్ధాలు, తప్పుడు ప్రచారాలతో ఈ ప్రాంత ప్రజలను మోసం చేసి గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యే ఒక్క రోజు కూడా ఈ నియోజకవర్గ ప్రజలకు సేవ చేయలేదన్నారు. ఐదేండ్ల పాటు అధికారంలో ఉండి ఇటు అభివృద్ధి పనులు చేయక.. అటు ఏ ఒక్కరికీ సాయం చేయకుండా.. మళ్లీ ఓట్ల కోసం వస్తున్నారని మండిపడ్డారు. ప్రజల కష్టాలు, కన్నీళ్లు కాంగ్రెస్ పార్టీకి పట్టవన్నారు. కేవలం వాళ్లకు కావాల్సి ఓటు, సీటు మాత్రమేనన్నారు. 2014లో పుట్ట మధూకర్‌ను ఎమ్మెల్యేగా ఈ ప్రాంత ప్రజలు ఆశీర్వదిస్తే ఈ ప్రాంతాన్ని ఏ విధంగా అభివృద్ధి చేశారు.. 2018లో గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యే చేశారో ప్రజలు బేరీజు వేసుకోవాలన్నారు. కేవలం అధికారం కోసం మాత్రమే పాటు పడే వారు కావాలా.. ప్రజల కష్టాలు, కన్నీళ్లు తీర్చే నాయకుడు కావాలా.. అనే విషయాన్ని ప్రజలు ఆలోచించుకో వాలన్నారు. నియోజకవర్గ ప్రజలు ఈ ఎన్నికల్లో పుట్ట మధూకర్‌ను ఓటు ద్వారా ఆశీర్వదిస్తే నాయకుడిగా కాకుండా సేవకుడిగా పని చేస్తాడని, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తాడన్నారు. ప్రజలంతా రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పుట్ట మధూకర్‌ను ఓటు ద్వారా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు ఆరెపల్లి కుమార్, వీకే. రవి, కుర్ర లింగయ్య, కాయితీ సమ్మయ్య, నక్క నాగేంద్ర శంకర్, ఎంఎస్ రెడ్డి పాల్గొన్నారు.

**పుట్ట మధు గెలుపునకు కృషి చేయాలి..**

మంథని రూరల్,నవంబర్ 19: నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజల కష్ట సుఖాల్లో పాలు పంచుకునే పుట్ట మధూకర్‌ను ఈ అసెంబీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్ గౌడ్, జడ్పీటీసీ తగరం సుమలత శంకర్‌లాల్, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ ఆకుల కిరణ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కనవేన శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మండలంలోని ఎక్లాస్‌పూర్, సూరయ్యపల్లి, లక్కేపూర్, పుట్టపాక, ఆరెంద, గోపాల్‌పూర్, నాగేపల్లి, అడవి సోమన్‌పల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫె స్టోతో పాటు పుట్ట మధూకర్ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఎన్నో ఏళ్లు నియోజకవర్గాన్ని కాంగ్రెస్ పాలించినా చేసిన అభివృద్ధి మాత్రం శూన్యమన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నదని చెప్పారు. కేసీఆర్ పథకం లేని ఇల్లు.. అభివృద్ధి జరగని ఊరు లేదన్నారు. మనకు సంక్షేమ అమలు కావాలన్నా.. నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలన్నా కారు గుర్తుకు ఓటు వేసి పుట్ట మధూకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో భీముని పుష్ప వెంకటస్వామి, రోడ్డ మమత శ్రీనివాస్, కెక్కర్ల సునిత, మాసిరెడ్డి శ్రీకళ, మిట్ట సత్యనారాయణ, ఎంపీటీసీ పెగడ శ్రీనివాస్, ఓదెలు, ఆకుల బాపులు ఉన్నారు.



మంథని రూరల్ : సూరయ్యపల్లి గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



మంథని :బీఆర్ఎస్ మ్యానిఫెస్టో కరపత్రాలు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శైలజ, నాయకులు



గొలపల్లిలో పుట్ట మధూకర్‌కు స్వాగతం పలుకుతున్న ప్రజలు

# బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

**మంథని ఎమ్మెల్యే అభ్యర్థి మధూకర్**

మహాముత్తారం, నవంబర్ 19 : బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని గండికామారం, చింతలపల్లి, గొల్లపల్లి, కిష్టాపూర్ గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అభివృద్ధితో పాటు సేవా కార్యక్రమాలు చేశానన్నారు. ఎమ్మెల్యేగా అభివృద్ధి చేసే అవకాశం ఉన్నా శ్రీధర్‌బాబు నియోజకవర్గాన్ని పట్టించుకోలేదన్నారు. తనను ఆశీర్వదిస్తే సీఎం కేసీఆర్ ప్రకటించిన వెయ్యి కోట్ల నిధులతో నియోజకవర్గంతో పాటు గండికామారాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. మ్యానిఫెస్టోలో ప్రకటించిన పథకాలు ప్రతి కుటుంబానికి భరోసా ఇస్తాయన్నారు. గండికామారం గ్రామంలో గూడు లేని ప్రతి కుటుంబానికి గృహలక్ష్మి పథకంలో ఇండ్లు మంజూరు చేయించి ప్రభుత్వం ఇచ్చే రూ.3 లక్షలతో పాటు తాను కొంత సాయం చేస్తానన్నారు. తనకు ఇంటి భాద్యతలు తీరాయని, ఇక నియోజకవర్గ ప్రజల భవష్యత్ బాధ్యతలు తీసుకుంటానన్నారు. ఆదరించి ఆశీర్వదిస్తే ఐదేండ్లు మీ సేవకుడిగా పని చేస్తానని తెలిపారు. ప్రచారంలో పార్టీ మండల అధ్యక్షుడు కల్వచర్ల రాజు, మాజీ జడ్పీటీసీ మందల రాజిరెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు మార్క రాముగౌడ్, కాటారం సబ్ డివిజన్ అధికార ప్రతినిధి జగన్‌నాయక్, సింగిల్ విండో వైస్ చైర్మన్ అనిల్‌రెడ్డి, సర్పంచ్ నెరెళ్ల రమా తిరుపతి, పార్టీ గ్రామఅధ్యక్షుడు రవి పాల్గొన్నారు.

# పుట్ట మధు.. నేను వదిలిన బుల్లెట్

- 70వేల ఓట్ల మెజార్టీతో గెలిపించండి..
- సీఎం కేసీఆర్ మంథనిని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తాడు
- సింగరేణి నష్టాలకు కారణం కాంగ్రెస్సే..
- కార్మికుల కష్టాలు తీర్చింది బీఆర్ఎస్ సర్కారే
- రామగిరి ప్రజా ఆశీర్వాద సభలో కల్వకుంట్ల కవిత

పెద్దపల్లి, నవంబర్ 19(నమస్తే తెలంగాణ): 'మంథని నియోజకవర్గ మట్టిబిడ్డ పుట్ట మధన్న నేను వదిలిన బుల్లెట్.. మాట తూటాలాగా ఉంటది.. కానీ చాలా మంచి వ్యక్తి.. మూడోసారి మీ ఆశీర్వాదం కోసం మీ ముందు నిలబడ్డాడు.. ఆశీర్వదించి మీరు అవకాశమిస్తే మరోమారు మంథని నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తాడు.. గెలిచినా.. ఓడినా.. మీ మధ్యనే ఉండి.. సేవ చేసిండు.. అనేక కార్యక్రమాలను నిర్వహించి మీ కోసం ముందుకు వచ్చిండు.. 70వేల ఓట్ల భారీ మెజార్టీతో పుట్ట మధన్నను గెలిపించండి.. గులాబీ కండువా ఇక్కడ ఉంటే.. నిధులు వరుదలా వస్తయి.. జరిగిన అభివృద్ధిని చూడండి.. బీఆర్ఎస్‌ను గెలిపించి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకోండి' అని భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకంట్ల కవిత అన్నారు. ఆదివారం రాత్రి మంథని నియోజకవర్గంలోని రామగిరి మండలం సెంటినరీకాలనీ వాణి విద్యానికేతన్ క్రీడా మైదానంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. పుట్ట మధన్నను గెలిపిస్తే ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గం ఏ విధంగా అభివృద్ధి జరిగిందో ఆ విధంగా మంథని నియోజకవర్గం అభివృద్ధి జరుగుతుందన్నారు. సీఎం కేసీఆర్ అనేక సభల్లో పాల్గొన్నారని, కానీ మంథని సభలో రూ. వెయ్యి కోట్లతో అభివృద్ధి చేస్తానని ప్రకటించారని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ అలా ప్రకటించారంటే మంథని నియోజకవర్గాన్ని ఆయన దత్తత తీసుకున్నట్లే అన్నారు. మంథని నియోజకవర్గంలో ఇంకా అనేక సమస్యలున్నాయని, అవన్ని పరిష్కారం కావాలంటే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దగ్గరైన వ్యక్తి పుట్ట మధూకర్ ఎమ్మెల్యే కావడం వల్లనే అది సాధ్యమవుతుందన్నారు. పదేండ్ల పాలనలో సీఎం కేసీఆర్ ప్రజల ఆత్మగౌరవాన్ని పెంచారని, ప్రజల అవసరాలు, అక్కర్లను తీర్చారన్నారు.



ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

**సింగరేణిని దివాలా తీయించింది కాంగ్రెస్ కాదా?**

లాభాల బాటలో నడవాల్సిన సింగరేణి సంస్థను అష్ట కష్టాల పాలు చేసి దివాలా తీయించింది కాంగ్రెస్ పార్టీ కాదా? అని మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబును ఆమె ప్రశ్నించారు. సింగరేణి బొగ్గు బ్లాక్‌లు పోయే దుస్థిలో ఉండగా నిలుపుకోవడానికి అప్పులు చేసిన మాట వాస్తవం కాదా? అన్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా ఇచ్చి సింగరేణిని తాకట్టు పెట్టారని ఆమె విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండి ఉంటే సింగరేణి ఎప్పుడో మూత పడేదన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్క సింగరేణి కార్మికుడు గుర్తించాలన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత టీబీజీకేఎస్ ప్రాతినిధ్యంతో సింగరేణిలో అనేక బొగ్గు బ్లాక్‌లను మూత వేయకుండా కృషి చేశామన్నారు. కార్మికులకు 32 శాతం లాభాల వాటా వచ్చేలా చూశామని, వారసత్వ ఉద్యోగాలను ప్రారంభించుకొని 12 వేల మంది డిపెండెంట్లకు ఒక్క సంతకంతో ఉద్యోగాలు ఇప్పించుకున్నామని, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తరువాత మొత్తం 19000 మంది ఉద్యోగాలు కల్పించుకున్నామన్నారు. ఈ ఉద్యోగాల కోసం మనం ప్రయత్నం చేస్తుంటే.. కాంగ్రెస్ నేతలు మాత్రం కేసులు పెట్టుకుంటూ వెళ్లారన్నారు. ఒక్కో సమస్యను పరిష్కరించుకుంటూ సింగరేణి బ్రతికించుకున్నామన్నారు. తెలంగాణలోని ఆర్టీసీ, ప్రభుత్వ రంగ సంస్థలను, పబ్లిక్ సెక్టార్ల, ప్రైవేట్ సెక్టార్లను కాపాడుకోవడానికి కేసీఆర్ కృషి చేస్తుంటే.. బీజేపీ వాటిని అమ్మకానికి పెడుతున్నదన్నారు.